RNI No - APTEL/2022/81596

# జనోదయ

janodaya

కరీంనగర్ శనివారం14.03.2026 సంపుటి : 03 సంచిక : 98 పేజీలు : 08 వెల : రూ.5

తెలుగు దినపత్రిక

Karimnagar Saturday 14.03.2026 Volume: 03 Issue 98 Pages 08 Cost 5/



# కమల వికాసమే లక్ష్యం

## నేడు కేంద్రమంత్రి బండి సంజయ్ పాదయాత్ర

**అంజన్న ఆశీర్వాద యాత్ర పేరుతో 40 కిలోమీటర్లు నడక**

**రాష్ట్ర రాజకీయాల్లో మళ్ళీ బండి క్రియాశీలకం**

**హైదరాబాద్:** రాష్ట్రంలో కమల వికాసమే లక్ష్యంగా కేంద్ర హెూంశాఖా సహాయ మంత్రి బండి సంజయ్ పావులు కదుపుతున్నారు.అంజన్న ఆశీర్వాద యాత్ర పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ 40 కిలోమీటర్లు కరీంనగర్ నుంచి కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి దేవాలయం వరకు పాదయాత్ర చేపడుతున్నారు. శనివారం కరీంనగర్‌లోని శ్రీమహాశక్తి దేవాలయం నుంచి ఉదయం 6 గంటలకు ఈ యాత్ర ప్రారంభమవుతుంది. బండి సంజయ్‌కుమార్ స్వయంగా ఈయాత్రలో ముందు నడువనుండగా ఇటీవల ఎన్నికైన 108 మంది సర్పంచులు, 450 మంది వార్డుసభ్యులు, 54 మంది కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, జిల్లాలోని బీజేపీ కీలకనేతలు, వివిధ విభాగాల నాయకులు, దారిపొడువునా ఆయా గ్రామాల బీజేపీశ్రేణులు, ప్రజలు పాల్గొనేలా యాత్రను రూపకల్పన చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున పార్టీ నేతలు దీనికి తరలివస్తారని అంచనా వేస్తున్నారు.కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మూడుసార్లు పరాజయం పాలైన బండి సంజయ్‌కుమార్ పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం వరుస విజయాలతో కేంద్రమంత్రి పదవి చేపట్టారు. అయినా ఆయనకు ఆ విజయం సంతృప్తిని ఇవ్వడం లేదని, మూడుసార్లు ఓడిన అసెంబ్లీ స్థానాన్ని దక్కించుకోవడం ద్వారా రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలపాత్ర నిర్వహించాలని పార్టీకి అత్యధిక స్థానాలు వస్తే ఇదివరకే రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవానికి తోడు కేంద్ర మంత్రి పదవిని నిర్వహిస్తున్న వ్యక్తిగా ముఖ్యమంత్రి పదవికి పోటీపడాలన్నది బండి సంజయ్‌కుమార్ అసలు లక్ష్యంగా సన్నిహితులు పేర్కొంటున్నారు. ఆ లక్ష్య సాధన దిశగానే ఆయన అడుగులు వేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.బండి పాదయాత్రకు బేజేపీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ పాదయాత్ర ద్వారా రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపు అవుతుందని ఆ పార్టీనేతలు అభిప్రాయపడుతున్నారు.

**రాష్ట్రంలో కమల వికాసమే లక్ష్యంగా కేంద్ర హెూంశాఖా సహాయ మంత్రి బండి సంజయ్ పావులు కదుపుతున్నారు.అంజన్న ఆశీర్వాద యాత్ర పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ 40 కిలోమీటర్లు కరీంనగర్ నుంచి కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి దేవాలయం వరకు పాదయాత్ర చేపడుతున్నారు. శనివారం కరీంనగర్‌లోని శ్రీమహాశక్తి దేవాలయం నుంచి ఉదయం 6 గంటలకు ఈ యాత్ర ప్రారంభమవుతుంది.**

## నెలసరి సెలవును తప్పనిసరి చేస్తే మహిళలను ఉద్యోగాల్లోకి తీసుకోరు!

**సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**

**మహిళల ఉపాధికే ముప్పు ఏర్పడుతుందని వెల్లడి**

**మహిళలకు వేతనంతో కూడిన నెలసరి సెలవు కోరుతూ దాఖలైన రిట్ పిటిషన్ కొట్టివేత**



**న్యూఢిల్లీ, మార్చి 13 :** అన్ని రంగాల్లో పనిచేసే మహిళలకు వేతనంతో కూడిన నెలసరి సెలవు కోరుతూ దాఖలైన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. అన్ని భాగస్వామ్య పక్షాలతో సంప్రదించి నెలసరి సెలవు విధానాన్ని రూపొందించడానికి పిటిషనర్ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. చట్టం ద్వారా నెలసరి సెలవులను తప్పనిసరి చేయడం వల్ల మహిళల ఉపాధిపై ఊహించని పరిణామాలు సంభవించ వచ్చని విచారణ సందర్భంగా కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇది మహిళలను యాజమాన్యాలు నియమించు కోకుండా నిరుత్సాహపరచవచ్చని, తద్వారా వారు శ్రామిక శక్తిలో పాల్గొనడంలో ప్రతికూల ప్రభావం చూపగలదని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చితో కూడిన ధర్మాసనం పేర్కొన్నది. పిటిషనర్ శైలేంద్ర మణి త్రిపాఠీ అర్హతలను ప్రశ్నించిన ధర్మాసనం ఈ విషయమై ఏ మహిళ కూడా కోర్టును ఆశ్రయించలేదని స్పష్టం చేసింది.

**పురుషులతో సమానంగా లేమనే భావన కలిగిస్తాయి..**

పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది ఎంఆర్ షంసద్ వాదనలు వినిపిస్తూ కేవలం కర్ణాటక ప్రభుత్వం మాత్రమే నెలసరి సెలవును అనుమ తించేందుకు విధాన నిర్ణయం తీసుకుందని తెలిపారు. నెలసరి సెలవులు ప్రతికూల ఫలితాలను కలిగిస్తాయని సీజేఐ అభిప్రాయ పడ్డారు. తాము పురుషులతో సమానంగా లేమ న్న భావన మహిళల్లో కలిగిస్తాయని, ఒక నిర్దిష్ట సమయంలో పురుషులతో సమానంగా మహిళలు పనిచేయలేరన్న ఒక రకమైన అభిప్రాయాన్ని సృష్టించడానికి మాత్రమే ఇది ఉపయోగపడుతుందని సీజేఐ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు.

## నేటి నుంచి పది పరీక్షలు

**హైదరాబాద్, మార్చి 13 :** పదో తరగతి వార్షిక పరీక్షలు నేటి (శనివారం) నుంచి ప్రారంభంకానున్నాయి. ఉదయం 9:30గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు మూడు గంటలపాటు పరీక్షలు జరుగుతాయి. ఐదు నిమిషాలు అంటే ఉదయం 9:35 కల్లా వచ్చిన విద్యార్థులను మాత్రమే పరీక్షలకు అనుమతి స్తారు. గంట ముందే సెంటర్లకు చేరు కోవాలని అధికారులు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పరీక్షల కోసం 2,676 సెంటర్లు ఏర్పాటు చేయగా 5,17,727 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాబోతున్నారు. ఆన్సర్ బుక్‌లెట్‌లోని పేజీలను చింపితే విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదుచేస్తామని అధికారులు హెచ్చరించారు.

**గవర్నర్ శుభాకాంక్షలు..**

పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షలను ఒత్తిడిగా భావించ కుండా జ్ఞానం, ప్రతిభను చూపించే అవకాశంగా



భావించాలని సూచించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో, సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు.

## ఆవిష్కరణల అడ్డా హైదరాబాద్

**రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, మార్చి 13 :**

ఆవిష్కరణలు, పెట్టుబడులకు గ్లోబల్ హబ్‌గా హైదరా బాద్ ఎదుగుతున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్ర మల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం బ్రిక్స్ దేశాల్లో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులకు అనువైన వాతావరణం, ఆధునిక సాం కేతికతల ప్రభావంపై అధ్యయనం చేసేం దుకు వచ్చిన జర్మనీ ప్రతినిధుల బృందం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక అవకాశాలు, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై మంత్రి వారితో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఫ్యూచర్ సిటీలో ఏర్పాటవుతున్న ఏఐ, నెట్ జీరో సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వంటి ప్రాజెక్టులకు రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయన్నారు.



## గ్యాస్ సిలిండర్ల కొరత లేదు

**భయాందోళనకు గురి కావొద్దు**

**సరఫరాపై అపోహలు వద్దు**

**బాట్లింగ్ ప్లాంట్లలో సరిపడా నిల్వలు**

**సోషల్ మీడియా వార్తలను నమ్మొద్దు**

**జిల్లాలలో కమిటీలు ఏర్పాటు చేసి చర్యలు తీసుకోండి**

**కలెక్టర్లతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**హైదరాబాద్, మార్చి 13 :**

తెలంగాణ రాష్ట్రంలో గ్యాస్ సిలిండర్లకు కొరత లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గ్యాస్ గృహ వినియోగదారులు గందరగోళానికి గురికాకుండా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. గృహ వినియోగదారులకు సరిపడా గ్యాస్ సరఫరా చేస్తామని తెలిపారు. ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన పని లేదని పేర్కొన్నారు. గ్యాస్ కొరతపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు.ప్రధానంగా గ్యాస్ నిల్వలు, అంతర్జాతీయ పరిస్థితులపై మంత్రి ఉత్తమ్ సమీక్షించారు. ఈ సమావేశానికి సీఎస్, కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు, గ్యాస్, ఆయిల్ కంపెనీలు, లీగల్ మెట్రలాజీ అధికారులు హాజరయ్యారు. ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించాలని మార్గనిర్దేశం చేశారు. గ్యాస్‌ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని స్పష్టం చేశారు.గ్యాస్ గృహ వినియోగదారులకు ఎక్కడ అసౌకర్యం కలిగించేలా చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గ్యాస్‌ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే ఎక్కడికక్కడ చర్యలు చేపట్టాలని.. కలెక్టర్లకు, సీపీలకు, ఎస్పీలకు ఆదేశాలు జారీ చేశారు. ఆస్పత్రులకు, ప్రభుత్వ వసతి గృహాలకు సరిపడా గ్యాస్ సరఫరా చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

# తరాలు మారినా, అంతరాలు తగ్గడం లేదు

### హై ఎండ్, బడ్జెట్ పాఠశాలల పేరిట గీతగీసిన కమిషన్

విద్య ప్రజాస్వామ్య ఆవిర్భావ అనంతరం ఆశించినంతగా పురోగమించలేదు. స్వాతంత్రం నాడు 14 శాతంగా ఉన్న అక్షరాస్యత 76 శాతానికి మాత్రమే చేరింది. బీదరికం, అవిద్య, పోషకాహార లోపం, గృహం, వైద్యం ఇలా ప్రాథమిక అవసరాలు అందని ద్రాక్షగానే ఉన్నాయి. విద్యా విధానాలకు పవిత్రగ్రంథంగా ఉన్న కొఠారి కమిషన్ సూచనలు నలభై ఏండ్లయినా, రోజుకొకసారి వల్లె వేసుకోవడం మినహా అమలుకు నోచుకోవడం లేదు. మరోవైపు 2009లో రూపొందించుకున్న విద్యాహక్కు చట్టం చెప్పిన 25 శాతం ప్రవేశాలు ప్రైవేటు సెక్టారులో జరగడం లేదని కమీషన్ మరోమారు నొక్కి వక్కాణించింది. కానీ వాటి అమలుకోసం ఎలాంటి పటిష్టమైన యంత్రాంగాన్ని రూపొందించలేదు. ఆటల ఉపాధ్యాయుల సమయం మధ్యాహ్నం 12 నుండి సాయంత్రం 7 వరకు ఉండాలని, అటెండర్లు, క్లారికల్ స్టాఫ్ మానిటరింగ్ కోసం కాంట్రాక్ట్ పద్ధతిన పర్యవేక్షకులుండాలని, డిజిటల్ డేటా సేకరణ కోసం ఏక, ద్వి ఉపాధ్యాయ పాఠశాలల్లో కాంట్రాక్టు సహాయకులుండాలని, నాలుగు గ్రామాలకు కలిపి ఉమ్మడి క్రీడావేదిక, క్రీడా వార్షికోత్సవం జరపాలని, విలువల విద్య, నైతిక విద్య, పని అనుభవం వంటివి నిర్దేశించిన కమిషన్ వెనకబడిన వర్గాలకు ప్రైవేటులో 25 శాతం ఇవ్వవలసిన ప్రవేశాల గురించిన పకడ్బందీ యంత్రాంగం ఏర్పాటు చేయక పోవడం బాధాకరం.

సంఖ్యలో 30 శాతంగా ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 60 శాతంగా ఉందని, విద్యా నాణ్యత, గౌరవం, భద్రత, రక్షణ వంటి అంశాలను ప్రైవేటులో చేర్పించడానికి ప్రాతిపదికలుగా పరిగణిస్తున్న తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో ఆ లోపాలు ఉన్నట్లు గుర్తించాలని తెలిపిన కమిషన్ ఎలాంటి మరమ్మతులు చేయునున్నదో చూడాలి. ప్రైవేటు కార్పొరేట్ విద్య నిమిత్తం 80 శాతం మంది ఫీజులు చెల్లించడానికి రుణాలు తీసుకుంటున్నారని, ఫీజుల విషయానికొస్తే ఒక్కో విద్యార్థికి 5000 నుండి 1600000 వరకు ఫీజులు వసూలు చేస్తున్నాయని, రకరకాల ఐఎస్సీఈ, ఐజీఎస్సీఈ, ఐఎస్సీ, ఐబీ వంటి పార్టీ ప్రణాళికలను అమలు చేస్తున్నాయన్నారు. అయితే వాటిని పక్కాగా నియంత్రించే యంత్రాంగం ప్రభుత్వం వద్ద ఉన్నప్పటికీ వారి ఆందోళన ఈ వ్యవస్థ నుండి పారి పోయినట్లుగా తోచింది. చట్టబద్ధ సంస్థను ఫీజులో నియంత్రణ కోసం ఏర్పాటు చేయాలన్న సూచన ప్రభుత్వ ఉపాధ్యాయుల జీతభత్యాలు, ప్రతిభా ఆధారిత పదోన్నతుల గురించి చెప్పినంత సూటిగా, స్పష్టంగా లేదనిపించింది. 5 రకాలుగా పాఠశాలలను వాటి ప్రాంత పరిధిని బట్టి వర్గీకరించారు. అయితే ఆయా పాఠశాలలు అనగా హై ఎండ్ పాఠశాలలు క్రీడలు పాటలు ఐసిటి డిజిటల్ కంటెంట్ కళలు చేతి పనులు సంగీతం నృత్యం రోబోటిక్స్ గ్రంథాలయం విశాల మైదానం వంటి అంశాలు కలిగి ఉండాలని చెప్పడం, అదే సమయంలో గ్రామీణ పాఠశాలలపై, వాటిపై ఆధారపడిన విద్యార్థులపై బడ్జెట్ పాఠశాలలుగా కేటాయించి సౌకర్యాల ఏర్పాటును తగ్గించడం గ్రామీణ బడుగు బలహీన వర్గాల విద్యార్థులపై వివక్ష చూపి



నట్లుగా అర్థమయింది. ఇది అభ్యంతరకరం. రాజు పేద అందరూ ఒకే బడిలో చదివే కల రానున్న 100 సంవత్సరాలకు నెరవేరదని ఆకునూరి మురళి గారు ఇది 100 సంవత్సరాల అవసరాలు తీర్చే సంస్కరణలు అని చెప్పినప్పుడే, ఇది మళ్లీ దిగువ తరగతిని గీతగీసి వేరు చేసే కొత్త పన్నాగం లాగానే అనిపిస్తున్నది.

ఆంగ్ల మాధ్యమాన్ని సుమారు అన్ని పాఠశాలలకు విస్తరించాలని కమిషన్ సూచించింది. దానికి గాను ఐ – ల్యాబ్ సంస్థ, యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్, ఎన్సీఈఆర్టీ, యునెస్కో, సీఐఐఎల్ తదితర సంస్థల అధ్యయనాలను ఉటంకించి ఏడు సంవత్సరాల లోపు పిల్లలు మూడు భాషలను నేర్చుకోగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉంటారని, కానీ తెలుగు మీడియం కావాలన్న వారికి మాత్రం పూర్వపు ఉమ్మడి జిల్లా పరిధిలో 5 నుండి 10 తరగతులకు నిర్దేశించిన రెసిడెన్షియల్ పాఠశాల ఉండాలన్నారు. ఇది తెలుగు మీడియం వారిని సమాజం నుండి వేరు చేయడమే. అలాగే విధిగా ఇంటర్ ఆంగ్ల మాధ్యమమేనని స్పష్టం చేశారు. ఇక ఉర్దూ సంస్కృతం విషయంలో వారు సూచనలు రాజకీయ పార్టీ లైన్లో స్పష్టంగా గోచరించాయి.

కాబట్టి విద్యా విధానాలు ఏ స్థాయిలో తయారైనప్పటికీ ఆయా ప్రభుత్వ పార్టీల రంగుల మరకలు అంటుతున్నాయి అన్నది మరోసారి స్పష్టమైంది. ఇక భౌతిక నిర్మాణాలు, కేటాయించవలసిన స్థలం, మంజూరు చేయవలసిన పోస్టులు, మధ్యాహ్న భోజన కార్మికులు, వారి కుకింగ్ కాస్ట్ తదితర వివరాలు, సిక్ రూమ్, సీసీ కెమెరాలు, కంప్యూటర్లు, సైన్స్ ప్రయోగశాలలు, అసెంబ్లీ స్థలం, సీడబ్ల్యుఎసెన్ ఏర్పాట్లు, డైనింగ్ ఏరియా, ల్యాండ్ స్కేపింగ్, ఐఎఫ్పీలు ఇలా అద్భుత పదజాలం మనలను కనికట్టు చేస్తున్నట్లు ఉంటుందనుటలో ఎలాంటి అతిశయోక్తి లేదు. న్యాయస్థానాలు నిర్దేశించిన కనీస వేతనాలను మధ్యాహ్న భోజన కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు మరియు పార్ట్ టైం వర్కర్ల విషయంలో పాటించకుండా ప్రభుత్వం ఈ కొత్త ప్రతిపాదనలకు బడ్జెట్ కేటాయింపులు చేస్తుందంటే హాస్యాస్పదంగా ఉన్నది.

ఒక మనిషి జీవితంలో అత్యంత ఉపయోగిక దశ పాఠశాల విద్యా దశ. రేపటి తరాన్ని, సమాజాన్ని, దేశాన్ని తయారు చేసే భావిభారత పౌరుల విషయంలో తయారు చేసిన నివేదిక అంతరాలను తగ్గించే దిశగా లేకపోవడం శోచనీయం.

మెడికల్ ఇంజనీరింగ్ వెంట వెంపర్లాడుతున్న యువతకు ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదిగా, విలువైనదిగా కనపడేలా చేయడం మాట అటుంచి, అనేక ఆంక్షలు, నియంత్రణలు, అడ్డంకులు, షరతులు సృష్టించడం అంటే ఈ విద్యా వ్యవస్థను ప్రైవేటుపరం చేయడానికి ముందస్తు సన్నాహక కార్యక్రమంలో భావించక తప్పదు. ప్రతి వృత్తిలో మాదిరిగానే ఇక్కడ కొంత అసంబద్ధతలు ఉండవచ్చు. అంతమాత్రాన వ్యవస్థకు ఆపాదించి, ఉపాధ్యాయ లోకాన్ని ద్వేషపూరితంగా చూడడం సమంజసం అనిపించుకోదు. నివేదిక ఆసాంతం అలాగే తోచడం బాధాకరం. ఏది ఏమైనా మీడియం, విధానాలు, నియామకాలు, వేతనాలు, పదోన్నతుల మాట ఎలా ఉన్నా బడులను మూసేసి మండలానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఒక్కటే దిక్కన్న సూత్రీకరణ ఎంత మాత్రమూ అంగీకార యోగ్యం కాదు. పట్టుకొమ్మలైన పల్లెటూర్ల విద్యా అస్తిత్వాన్ని కూకటి వేర్లతో పెకిలించడమే. రాజకీయ సామాజిక చైతన్యాన్ని పల్లెనుండి వెళ్ళగొట్టడమే అవుతుంది.

.....................

దాసరి శ్రీధర్
కరీంనగర్

# మండల అభివృద్ధికి ఐక్యంగా పనిచేద్దాం

### సర్పంచ్‌ల అభిప్రాయం

**జనోదయ, జగిత్యాల ప్రతినిధి, మార్చి 13:**

జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ చేకూరి అరుణ శేఖర్ ఏర్పాటు చేసిన తేనేటి విందు కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది. ఈ విందుకు మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు హాజరై పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రేచపల్లి గ్రామ సర్పంచ్ బాస మహేష్, బట్టపల్లి గ్రామ సర్పంచ్ మద్దిపెల్లి అశ్విని రమేష్, లచ్యానాయక్ తండా గ్రామ సర్పంచ్ గడ్డం గంగారాం, లక్ష్మీదేవిపల్లి గ్రామ సర్పంచ్ మేకల శేఖర్, నాగునూర్ దామెర రుషేంద్ర శంకర్ రెడ్డి, నాయకపు



గూడెం గ్రామ సర్పంచ్ కొత్తూరి పుష్పనాథ్, ఒడ్డెరా కాలనీ గ్రామ సర్పంచ్ పల్లపు మాధవి బాపురాజ్, పెంబట్ల గ్రామ సర్పంచ్ కోలపాక రాదారాజు, పోతారం గ్రామ సర్పంచ్ మల్యాల జ్యోతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు పరస్పరం అభినందనలు తెలియజేసుకుంటూ, మండల అభివృద్ధి కోసం ఐక్యంగా పని చేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.




### ములుగు జిల్లా ఆసుపత్రిని

# సమన్వయకర్త డాక్టర్ జగదీశ్వర్ ఆకస్మిక తనిఖీ




జనోదయ : ములుగు, మార్చి 13

ములుగు జిల్లా డి సి హెచ్ ఎస్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సూపరింటెంట్ డాక్టర్ సురేష్ కుమార్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులో భాగంగా వాజేడు వెంకటాపూర్‌లో హాస్పిటల్ లో వివిధ విభాగాలు కలిగి ఏమేమి సదుపాయాలు ఉన్నాయో సూపరింటెంట్ సురేష్‌ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వార్డులను కలియ తిరుగుతూ పేషెంట్లకు ట్రీట్మెంట్ సక్రమంగా అందుతుందా లేదా అని వారిని తెలుసుకున్నారు. మరియు శానిటేషన్ కూడా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండాలని వారన్నారు. ఇదే విధంగా శానిటేషన్ మెయింటైన్ చేయాలని శానిటేషన్ సూపర్వైజర్‌కు సూచించారు. ల్యాబ్ ఎక్స్రే విభాగాలు అన్ని సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అని ఆరాతీశారు. హాస్పిటల్ చుట్టూ కలియ తిరుగుతూ శుభ్రత పరిశుభ్రతలను పరిశీలించారు. ఏజెన్సీ ప్రాంతమైన వాజేడు వెంకటాపూర్ సిహెచ్సిలో ఏజెన్సీ ప్రాంత ప్రజలకు సరియైన వైద్య సదుపాయాలు అందించాలని డాక్టర్లను ఆదేశించినారు. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో వాతావరణానికి అనుకూలంగా డయేరియా డిహైడ్రేషన్ వడదెబ్బ తలిగిన రోగులకు మెరుగైన వైద్యం అందించేలా డాక్టర్లు చర్య తీసుకోవాలని అవసరమైతే వార్డులోని కొన్ని ప్రత్యేక బెడ్లను కేటాయించాలని సూచించినారు అదేవిధంగా అందరూ ఉద్యోగులు క్రమం తప్పకుండా అటెండెన్స్ యాప్ ఉపయోగించాలని లేనిపక్షంలో వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు వైద్యులు ఉద్యోగులు సమయపాలన పాటించి ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మంచి వైద్య సదుపాయం అందించి జిల్లాలోని వాజేడు వెంకటాపూర్ సిహెచ్సి ఆదర్శంగా నిలవాలని వారు ఈ సందర్భంగా అన్నారు. వారి వెంట ఎటునాగారం సూపరింటెంట్ డాక్టర్ సురేష్ కుమార్ మరియు ఆఫీస్ సిబ్బంది ఉద్యోగులు ఉన్నారు.

### బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని

# ప్రజల ఆందోళన



జనోదయ, జగిత్యాల ప్రతినిధి, మార్చి 13

సారంగాపూర్ మండలం పెంబట్ల కొనాపూర్ బ్రిడ్జ్ వద్ద పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతూ గ్రామస్తులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ మార్గంలో వెళ్తున్న ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ గ్రామస్తులతో మాట్లాడి, బ్రిడ్జి వద్ద అప్రోచ్ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన సంబంధిత ఈఈ మరియు కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

# చందానగర్‌లో అర్ధరాత్రి అగ్ని ప్రమాదం

### ఫర్నిచర్ షోరూం దగ్ధం..భారీ ఆస్తి నష్టం

జనోదయ : శేరిలింగంపల్లి,మార్చి13

శేరిలింగంపల్లి పరిధిలోని చందానగర్ ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికంగా ఉన్న అను ఫర్నిచర్ అండ్ ఎలక్ట్రానిక్స్ షోరూంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి భారీగా వ్యాపించాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ అగ్ని ప్రమాదం సంభవించినట్లు షోరూం యజమాని రమణారెడ్డి తెలిపారు. సంఘటన సమయంలో సెక్యూరిటీ గార్డ్ భోజనానికి వెళ్లి తిరిగి వచ్చేసరికి షోరూం లోపల నుంచి పొగలు వస్తుండటం గమనించాడు. షట్టర్ తెరవడానికి ప్రయత్నించేలోపు మంటలు వేగంగా వ్యాపించాయని తెలిపారు.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని మూడు ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. కొంతసేపటి తర్వాత మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు.ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడం ఊరటనిచ్చినప్పటికీ, షోరూం లోని ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు పూర్తిగా దగ్ధమై భారీ ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.అగ్ని ప్రమాదానికి



గల ఖచ్చితమైన కారణాలపై అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# విద్యారంగానికి 30% బడ్జెట్ కేటాయించాలి

### ఏ ఐ ఎస్ ఎఫ్ డిమాండ్
### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి ఏఐఎస్ఎఫ్ వినతి పత్రం

జనోదయ : హనుమకొండ, మార్చి 13

అఖిల భారత విద్యార్థి సమాఖ్య హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని కలిసి విద్యారంగ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 30 శాతం నిధులు కేటాయించాలి అని ఏ ఐ ఎస్ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాష బోయిన సంతోష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, హాస్టళ్లలో వసతుల సమస్యలు, స్కాలర్‌షిప్‌లు ఆలస్యం వంటి అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని కోరా రు. ఈ సందర్భంగా ఏ ఐ ఎస్ ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషా బోయిన సంతోష్ మాట్లాడుతూ "ప్రజా పాలన అంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం వాస్తవానికి విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయకుండా కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తూ అనుకూల విధా నాలు అమలు చేయడం వల్ల సాధారణ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. విద్య అనేది హక్కు,అది వ్యాపారం కాదు. విద్యను వ్యాపారంగా మార్చే కుట్రలను,విధానాలను భవిష్యత్తులో ఉద్యమలతో తిప్పి కొడతామని అలాగే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తగిన నిధులు కేటాయించకపోతే వి



ద్యార్థులతో కలిసఏ ఐ ఎస్ ఎఫ్ పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతుందని హెచ్చరిం చారు.ఏ ఐ ఎస్ ఎఫ్ తరఫున ప్రభుత్వానికి ప్రధానంగా ఈ డిమాండ్లు తెలియజేశారు రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 30% నిధులు కేటాయించాలి.ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు మెరు గుపరచాలి. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లలో మెరుగైన వసతి,భోజన సదుపాయాలు కల్పించాలి.స్కాల రిషిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి.ప్రభుత్వ అనుమతులేని, కనీస మౌలిక సదుపాయాలు లేని ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలను మూసివేయాలి. షూ ,టై, బెల్టు, పాఠ్య పుస్తకాల వంటి పేరుతో దందా చేసే విద్య సంస్థలపై కఠిన చర్యలు తీసు కోవాలన్నారు.ఈ కార్యక్ర మంలో పాల్గొన్న నాయకులు,జిల్లా ఉపా ధ్యక్షులు బొజ్జ జ్యోతి, జక్కుల భానుప్ర సాద్, సిపతి వినయ్, సిహెచ్ వంశీ కుమార్, శ్రవణ్‌లు పాల్గొన్నారు.

# మాకేం పని లేదనుకుంటున్నారా?

- పుష్కరాల కంటే ముఖ్యమైనది ఏమున్నది?
- అధికారులపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఫైర్
- పుష్కరాల పనులకు మే మొదటి వారం డెడ్ లైన్
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందజేత





**జనోదయ, భూపాలపల్లి, మార్చి 13:**

మాకేం పని లేదు అనుకుంటున్నారా.. పుష్కరాల కంటే ముఖ్యమైన పనులు ఏమున్నాయి.. అని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సరస్వతి అంత్య పుష్కరాలు, గోదావరి పుష్కరాల సందర్భంగా అధికారులతో సమీక్ష సమావేశానికి ఎస్ ఇ స్థాయి అధికారులు హాజరు కాకపోవడం పై మంత్రి తీవ్ర స్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాంతంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. కాళేశ్వరం నుంచి పలుగుల వరకు 22 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించబోయే 7 కిలోమీటర్ల డబుల్ బీటీ రోడ్డు పనులకు, అదేవిధంగా కాళేశ్వరంలో 1.20 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న మ్యూజియం పనులకు, ఆది ముక్తేశ్వర దేవస్థానం నుండి సరస్వతి ఘాట్ వరకు 2 కోట్ల 38 లక్షల రూపాయల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు, 1 కోటి 55 లక్షల రూపాయలతో నిర్మించిన అన్నదాన సత్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం, అన్నారం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు. అనంతరం కాళేశ్వరం ఈఓ కార్యాలయంలో సరస్వతి అంత్య పుష్కరాలు, రాబోయే గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

### మే మొదటి వారం డెడ్ లైన్...

పుష్కరాల నిర్వహణకు సంబంధించిన పనులను అధికారులు సమన్వయంతో మే మొదటి వారం వరకు వేగంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక వసతుల కల్పన పై దృష్టి పెట్టాలని సూచించారు. బస్టాండ్ కు చెరువు స్థలం కేటాయించాలని సీసీఎల్ఏతో ఫోన్‌లో మాట్లాడి చెరువు మొత్తం ఎండిపోయింది, పంటలు కూడా సాగు చేయడం లేదు కాబట్టి బస్‌స్టాండ్ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని సూచించారు. బస్ స్టాండ్ స్థలం గెజిట్ లేదు కదా ఎందుకు ఆటంకం కలిగిస్తున్నారని అటవీ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బస్ స్టాండ్ లేకపోవడం వల్ల భక్తులు ఇబ్బంది పడుతున్నారని, చెరువు సర్వే చేయాలని సూచించారు. సమావేశంలో కలెక్టర్ రాహుల్ శర్మ, ధార్మిక సంస్థ సలహాదారుడు గోవింద హరి, ఎస్పీ సంకీర్త్, అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, దేవాదాయ, ఇరిగేషన్, విద్యుత్తు, పీఆర్, ఇరిగేషన్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### మహిళల ఆర్థికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత...

అనంతరం మంత్రి మహాదేవపూర్ మండలంలోని గిరిజన సంక్షేమ భవన్‌లో కుట్టు మిషన్ల శిక్షణా కార్యక్రమం, స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీదర్ బాబు మాట్లాడుతూ... మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించడంతో పాటు మహిళా సంఘాలకు ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే వ్యవసాయ శా ఖ, ఉద్యాన శాఖల ద్వారా రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు, ఉద్యాన యాంత్రీకరణ పరికరాలను అందజేశారు. మహిళలు శిక్షణతో పాటు ఉత్పత్తి సాధనకు కూడా మహిళలు కృషి చేయాలని సూచించారు. త్వరలోనే కాటారం, మంథని ప్రాంతంలో గార్మెంట్స్ చిన్న ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మహాదేవపూర్ ప్రాంతంలో అగరుబత్తుల తయారీకి సంబంధించిన పెద్ద అగరు వత్తుల కంపెనీ ద్వారా మహిళలకు శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. శిక్షణ పొందిన మహిళలు నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేసినప్పుడే వాటికి మంచి మార్కెట్ లభిస్తుందని, తద్వారా లాభాలు పొందవచ్చని మంత్రి తెలిపారు. రాజీవ్ యువశక్తి ద్వారా డైరీ ఉత్పత్తులపై కూడా శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఒక సమగ్ర వ్యవస్థ ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు.

### మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణపై మంత్రి ఆగ్రహం...

మహిళా శక్తి క్యాంటీన్లు సక్రమంగా నిర్వహించకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు త్వరలోనే పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయనున్నట్లు, వాటి నిర్వహణకు అవసరమైన శిక్షణ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే వదినపల్లి, నాచారం ప్రాంతాల్లో సోలార్ పవర్ స్టేషన్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి ఈ ప్రభుత్వం రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేస్తోందని మంత్రి తెలిపారు. రైతులకు రైతు భరోసా పథకం, సన్న వడ్లకు బోనస్ అందిస్తున్నా మని చెప్పారు. అలిమ్ సమస్త సంస్థ మహిళా సాధికారత కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ మహిళలను ముందుకు తీసుకెళ్తోందని మంత్రి అభినందించారు. గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణతో పాటు వివిధ సంస్థలను పరిచయం చేయాలని సూచించారు. వయాట్రీస్, అలిమ్ సంస్థల ద్వారా మూడు మండలాల్లో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కుట్టిన వస్త్రాలను మార్కెటింగ్ చేయడానికి కూడా అలిమ్ సంస్థ ముందుకు రావాలని కోరారు.

# అమెరికా సామ్రాజ్యవాద విధానాలు ప్రపంచ శాంతికి విఘాతం

## తాటిపర్తి జీవన్‌రెడ్డి

**జనోదయ, జగిత్యాల ప్రతినిధి,**

జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్లో మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమెరికా సామ్రాజ్యవాద విధానాలు ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తున్నాయని ఆయన విమర్శించారు. అమెరికా శాంతికాముక దేశమని చెప్పుకుంటూనే ఇజ్రాయిల్తో కలిసి ఇరాన్పై యుద్ధానికి దిగడం సరికాదన్నారు. ఈ యుద్ధ ప్రభావం యావత్ ప్రపంచంపై పడుతోందని చెప్పారు. భారత్ ఆపరేషన్ సింధూర ద్వారా పాకిస్తాన్పై పట్టు సాధించే దశలో అమెరికా ఒత్తిడి చేసి యుద్ధాన్ని నిలిపివేయించిందని ఆరోపించారు. యుద్ధాన్ని ఆపేందుకు ఐక్యరాజ్య సమితి ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. గల్ఫ్ దేశాల్లోని అమెరికా ఎయిర్‌బేస్‌లపై ఇరాన్ దాడులు చేయడంతో దాని ప్రభావం భారతీయులపై కూడా పడుతోందని చెప్పారు. క్రూడాయిల్ ధరలు పెరగడంతో వాణిజ్య అవసరాలకు ఉపయోగించే కుకింగ్ గ్యాస్ ధరలు పెరిగి పాఠశాలల వసతి గృహాలు, సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందన్నారు. కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నా, రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన తెలంగాణ వాసులు లక్షల్లో ఉన్నారని, వారి క్షేమంపై కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. యుద్ధ నివారణకు భారత్ తన వంతు కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో పెరిగిన వంటగ్యాస్ ధర భారం వినియోగదారులపై పడకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిలిండర్ రూ.500కే అందించే పథకం అమలులో ఉన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. 2005లో సిలిండర్ ధర రూ.50 పెరిగినప్పుడు అప్పటి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఆ భారం వినియోగదారులపై పడకుండా భరించిందని గుర్తుచేశారు. ప్రపంచంలోని ముస్లింలకు పవిత్ర మాసమైన రంజాన్ సందర్భంగా యుద్ధం నిలిచిపోయేలా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో తీర్మానం చేసి శాంతి ప్రయత్నాలు చేయాలని తాటిపర్తి జీవన్‌రెడ్డి కోరారు.



# 'గ్యాస్' బ్లాక్ చేస్తే కఠిన చర్యలు

**గ్యాస్ కొరత లేదు.. భయాందోళనకు గురి కావొద్దు**

**సరఫరాపై అపోహలు వద్దు**

**బాట్లింగ్ ప్లాంట్లలో సరిపడా నిల్వలు**

**సోషల్ మీడియా వార్తలను నమ్మొద్దు**

**జిల్లాలలో కమిటీలు ఏర్పాటు చేసి చర్యలు తీసుకోండి**

**కలెక్టర్లతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**జనోదయ, వరంగల్, మార్చి 13:** అమెరికా ఇరాన్ ఇజ్రాయిల్ దేశాల మధ్య యుద్ధం జరుగుతున్న కారణంగా రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడుతుందనే అపోహలను అడ్డుపెట్టుకొని గ్యాస్‌ను బ్లాక్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌర సరఫరాల,నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కలెక్టర్లతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డిస్ట్రిబ్యూటర్లను హెచ్చరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**గ్యాస్‌పై అపోహలు నమ్మవద్దు...**

గ్యాస్ కొరత అంటూ జరుగుతున్న ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలని, గ్యాస్ సరఫరా పై అపోహలు నమ్మవద్దని మంత్రి అన్నారు. గ్యాస్ సిలిండర్ల పై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంతోటే ఈ దుస్థితి ఏర్పడిందని,గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులకు, విద్యా సంస్థలతో పాటు ప్రభుత్వ సంస్థలకు, ఆశ్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ పర్యవేక్షణ జరుగుతుందని మంత్రి తెలిపారు. యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని మంత్రి స్పష్టం చేశారు.

**సరిపడా సరఫరా చేస్తాం...**

ఎల్.పి.జి గ్యాస్ సరఫరా విషయంలో ఎటువంటి గందరగోళానికి గురి కావొద్దని,గృహ వినియోగదారులకు సరిపడా సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు. సోషల్ మీడియా వేదిక ద్వారా జరుగుతున్న తప్పుడు ప్రచారంతోటే కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించేందుకు జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రస్థాయిలో తిప్పి కొట్టారు. ఇటువంటి గందరగోళం ఏర్పడినందునే రోజు వారిగా 72% బుకింగ్స్ జరుగుతున్నాయని అయితే గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రిలకు,విద్యాసంస్థలకు వృద్ధాశ్రమలకు, ప్రభుత్వ సంస్థలకు ప్రాధన్యత క్రమంలో సరఫరా చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో 810 ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి 29 లక్షల ఎల్.పి.జి కనెక్షన్లు ఉండగా రోజు వారిగా 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతుందని ఆయన వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోనీ బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత ఉన్నట్లు ఎక్కడా నమోదు కాలేదని ఆయన చెప్పారు.



**కఠిన చర్యలు తీసుకోండి...**

తాజాగా జరుగుతున్న ప్రచారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమంగా గ్యాస్ నిలువ చేయడం,అక్రమంగా మళ్లించడం ,బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడినందుకు ఇప్పటి వరకు 288 కేసులు నమోదు చేశామన్నారు. ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్లు ఇదే విధంగా ప్రవర్తిస్తే మరిన్నీ కఠిన చర్యలకు ఉపక్రమించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు,ఎస్.పి లు,పోలీస్ కమిషనర్లకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల కొకసారి , గ్రామీణ 45 రోజులకు ఒకమారు ఎల్.పి.జి బుక్ చేసుకోవాలని ఆయన గ్యాస్ వినియోగదారులకు సూచించారు.

---

## జాతీయస్థాయిలో

# భద్రకాళి ఆలయం అభివృద్ధి

- **ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం**
- **అభివృద్ధిపై రాజకీయాలు చేయొద్దు**
- **ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**
- **రూ.16.10 కోట్లతో పూడికతీతకు శ్రీకారం**

**జనోదయ, హనుమకొండ, మార్చి 13:** భద్రకాళి ఆలయాన్ని జాతీయస్థాయిలో అభివృద్ధి చేసి, దేశవ్యాప్తంగా భక్తులు వచ్చే ప్రధాన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం భద్రకాళి సుందరీకరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కలెక్టర్ చాహత్ బాజ్పాయ్, మేయర్ గుండు సుధారాణిలతో కలిసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ... గతంలో రూ.9 కోట్లతో ప్రారంభించిన



పూడికతీత పనులు పూర్తి స్థాయిలో జరగకపోవడంతో ఇప్పుడు రూ.16.10 కోట్ల నిధులతో సమగ్రంగా చెరువు పూడికతీత పనులను చేపడుతున్నామని చెప్పారు. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులతో ఎలాంటి అంతరాయాలు లేకుండా చెరువు పునరుద్ధరణ, మాడ వీధుల పనులు చేపడుతున్నామని తెలిపారు.

**అభివృద్ధిపై రాజకీయాలు చేయొద్దు...**

ప్రతిపక్ష పార్టీ నాయకులు అభివృద్ధి కార్యక్రమాలు జరిగితే తమకు చెడ్డపేరు వస్తుందనే భయంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. గత పాలకులు అమ్మవారి పేరును రాజకీయ లబ్ధికి వినియోగించుకున్నారని, తమ అనుచరులకు ఆలయ పరిసరాల్లో వ్యాపార సంస్థలు ఇచ్చి రేట్లు పెంచి ప్రజలకు భారంగా మార్చారని ఎమ్మెల్యే విమర్శించారు. సమిష్టి నాయకత్వంతో వరంగల్ నగరాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.

**ప్రధాన పర్యాటక కేంద్రంగా...**

భద్రకాళి చెరువు సుందరీకరణలో భాగంగా ఆలయం నుంచి బండ్ వైపు గ్లాస్ వంతెన ఏర్పాటు చేసే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. దేశ వ్యాప్తంగా భక్తులు వచ్చి దర్శించుకునేలా భద్రకాళి ఆలయాన్ని ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. గతంలో 70 ఏళ్ల క్రింద పూడికతీత జరిగిన చెరువును నేడు మళ్లీ మా హయాంలో జరగడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.

# వృద్ధురాలి మృతి



**జనోదయ, మందమర్రి మార్చి 13:** పట్టణంలోని రెండవ జోన్‌కు చెందిన జక్కనబోయిన లక్ష్మీ(80) అనే వృద్ధురాలు ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ గోపతి నరేష్ తెలిపారు. మృతురాలి కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణంలో మృతురాలు ఒంటరిగా నివసిస్తుండగా, మార్చి 12న రాత్రి అదే ఇంట్లో అద్దెకు నివసిస్తున్న రసూల్ అనే వ్యక్తి శ్రీనివాస్ కు ఫోన్ చేసి, అతని తల్లి లక్ష్మీ గడప వద్ద కిందపడి చనిపోయి ఉందని తెలుపగా, సంఘటన స్థలానికి వచ్చి చూసేసరికి ఆమె గడప తగిలి కింద పడడంతో తలకు గాయమై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారని, అదేవిధంగా మృతురాలి కుడి చేతి పై ఏదో జంతువు కరిచినట్లుగా గాయాలు ఉన్నాయని ఆమె కుమారుడు తన ఫిర్యాదులో తెలిపాడన్నారు. మృతురాలికి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఈమేరకు మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నమని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి తరలించామన్నారు.



# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ఇచ్చిన మాట నెరవేర్చే ప్రభుత్వం**
**కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం**
**ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు**



**జనోదయ, హనుమకొండ, మార్చి 13:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 45వ డివిజన్ పరిధిలోని తరాలపల్లి గ్రామానికి చెందిన సింగారపు అరుణ - వెంకటేష్ దంపతులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం నుంచి కేటాయించిన రూ 5 లక్షల ఆర్థిక సహాయంతో తమ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారు. ఆ నివాసానికి కొత్త ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్యతిథిగా పాల్గొని గృహ ప్రవేశం చేసి వారి కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపిన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అనంతరం ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేసిన సింగారపు అరుణ - వెంకటేష్‌కి నూతన వస్త్రాలు పెట్టి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు తమ గృహ ప్రవేశానికి విచ్చేసిన ఎమ్మెల్యే నాగరాజుని శాలువాతో సత్కరించి ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుతోంది. పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం. పేదల ముఖంలో చిరునవ్వు చూడటమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం అని పేర్కొన్నారు.గత పాలకులు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అని చెప్పి పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు నిజమైన న్యాయం జరుగుతోందని స్పష్టం చేశారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మంది పేదలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే నాగరాజు గారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కర్ర హరీష్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎం.డి బషీర్, డివిజన్ నాయకులు నర్మెట్ట వెంకటరమణ గౌడ్, సదానందం, శ్రీనివాస్ రెడ్డి, నీలం రజిని, గుర్రం జ్యోతి,బస్కే ప్రణయ్, కృష్ణ తో పాటు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకున్న పారిశుద్ధ్య కార్మికురాలు



**జనోదయ, బెల్లంపల్లి,మార్చి13:** తాండూరు మండలం గోపాల్ నగర్‌కు చెందిన గాజుల లక్ష్మికి చెందిన బంగారం చెవికమ్మ శుక్రవారం కింద పడిపోయింది. ఉదయం పంచాయతీ కార్మికురాలు ఇప్ప ఎల్లమ్మ విధులు నిర్వహిస్తుండగా రోడ్డుపై బంగారం చెవికమ్మ దొరకడంతో పంచాయతీ కారోబార్ సంపత్‌కు తెలిపింది. గాజుల లక్ష్మిని పంచాయతీ కార్యాలయం వద్దకు పిలిపించి పోగొట్టుకున్న బంగారం చెవి కమ్మను అందజేశారు. నిజాయితీ చాటుకున్న ఇప్ప ఎల్లమ్మను గ్రామస్తులు అభినందించారు.

## సోషల్ మీడియాలో నటి అనసూయపై అసభ్యకర వ్యాఖ్యలు

**-నిందితుడిని పట్టుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు**



**జనోదయ: శేరిలింగంపల్లి మార్చి 13:** అనసూయ భరద్వాజ్ పై సోషల్ మీడియా వేదికలలో అసభ్యకర, అపకీర్తి కలిగించే పోస్టులు పెట్టిన వ్యక్తిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశా రు. సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు అనసూయ ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేశారు. 2025 డిసెంబర్ 23 నుంచి కొన్ని సోషల్ మీడియా ఖాతాల ద్వారా ఆమెపై అవ మానకర, అసభ్య వ్యాఖ్యలు, అపకీర్తి కలిగించే కంటెంట్ ప్రచారం జరుగుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దర్యాప్తు నిర్వహించిన పోలీసులు ఇందుకు బాధ్యుడిగా గుర్తించిన జనార్ధన్ (29) అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఇంద్రానగర్, హైదరాబాద్‌కు చెందిన జనార్ధన్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా @mmtti_official ద్వారా అనసూయను లక్ష్యంగా చేసుకుని ఏఐ సాంకేతికతతో తయారు చేసిన వీడియోతో పాటు అభ్యంతరకర కంటెంట్‌ను ప్రచారం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై క్రైమ్ నెంబర్ 81/2026 కింద బిఎన్ఎస్ చట్టంలోని సెక్షన్లు 75, 79, 336(4), 351, 356తో పాటు ఐటీ చట్టం సెక్షన్లు 66ఈ, 67 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.సోషల్ మీడియాలో అసభ్యకర, అపకీర్తి కలిగించే పోస్టులు చేయడం చట్టరీత్యా శిక్షార్హమని పోలీసులు హెచ్చరించారు. ఇటువంటి సైబర్ నేరాలు గమనించినప్పుడు సమీప సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ లేదా 1930 సైబర్ హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.

# కేకే-5 గనిని సందర్శించిన కార్పొరేట్ సేఫ్టీ జీఎం



**జనోదయ, మందమర్రి, మార్చి 13:** ఏరియాలోని కేకే-5 గనిని కార్పొరేట్ జీఎం సేఫ్టీ సాయిబాబా శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గనికి సంబంధించిన ఉత్పత్తి లక్ష్యాలు, రక్షణ చర్యలపై గని మేనేజర్ శంభూనాథ్ పాండేను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జీఎం సేఫ్టీ సాయిబాబా మాట్లాడుతూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించడమే యాజమాన్యం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రమాదాలు లేని సింగరేణి నిర్మాణం కోసం ఉద్యోగులు, అధికారులు కలిసికట్టుగా అంకితభావంతో పనిచేయాలని సూచించారు. యాజమాన్యం ఎప్పటికీ రక్షణకే పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. పనిలో ఏకాగ్రతతో పనిచేస్తే ప్రమాదాలు నివారించవచ్చని, ప్రతిరోజూ రక్షణ సూత్రాలను పాటిస్తూ విధులు నిర్వహించాలన్నారు. ప్రమాదాల నివారణ కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రక్షణ చర్యలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు కేవలం 15 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందని, లక్ష్యాన్ని చేరుకోవడమే కాకుండా అదనపు ఉత్పత్తి సాధించి మంచి రికార్డులు నెలకొల్పాలని సూచించారు. అనంతరం ఆయన గనిలోకి దిగి పని ప్రదేశాలను పరిశీలించి ఉద్యోగులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ జీఎం సేఫ్టీ రఘుకుమార్, ఏరియా రక్షణ అధికారి భూశంకరయ్య, కేకే వన్ గ్రూప్ ఏజెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుంట్ల కవిత జన్మదిన సందర్భంగా రక్తదానం



**జనోదయ :చెన్నూరు ఆర్సీ:** తెలంగాణ జాగృతి మంచిర్యాల్ జిల్లా యువ నాయకులు కొరకొప్పుల మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం గవర్నమెంట్ హాస్పిటల్ నందు కల్వకుంట్ల కవిత జన్మ దినాన్ని పురస్కరించుకొని ఈ సందర్భంగా మంచిర్యాల గవర్నమెంట్ హాస్పటల్ నందు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది.అనుక్షణం అనునిత్యం ప్రజలతో మమేకమై అందరితో కలిసిపోయి ప్రజలలో నోట్లోనాలుక లాగా పేద ప్రజలకు అనునిత్యం ఆసరాగా ఉంటూ అందరి గురించి శ్రమించి కరిగిపోయే కోవత్తి లాగా అనుక్షణం ప్రజా సమస్యలే తన సమస్యలు అనుకొని ప్రజలే జీవితం అనుకొని ముందుకు నడుస్తూ అందరి అభిమానాన్ని చూరగొంటు అనునిత్యం పోరాడే కల్వకుంట్ల కవితకి తెలంగాణ జాగృతి మంచిర్యాల జిల్లా పక్షాన పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజయ దం జగరిగింది. మరియు ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథులుగా హెచ్ ఎం ఎస్ రాష్ట్ర అధ్యక్షులు తిప్పారపు సార య్య మరియు తెలంగాణ జాగృతి జిల్లా యూత్ ప్రెసిడెంట్ మేడి రాజశేఖర్ టీజే ఎస్ఎఫ్ జిల్లా ప్రెసిడెంట్ నరేష్,పెద్దప ల్లి మహిళ జిల్లా అధ్యక్షురాలు హారిక రావు మరియు జాగృతి నాయకులు కోర కొప్పుల దిలీప్ కుమార్ గౌడ్, సురేష్, బి. సంధ్యారాణి, బి. రామకృష్ణ, జీవన్, పి. సంపత్, నరేష్, రాజన్న, సంతోష్, వేముల సాయికుమార్ గౌడ్ పాల్గొని ఈ సందర్భంగా రక్తదానం చేయడం జరిగింది. అనంతరం మహేష్ గౌడ్, ప్రేమ్ రావు, గంగారపు నారాయణ, శ్రీనివాస్, ఎగ్గడి మహేష్, జాగృతి కార్యకర్తలతో హాస్పటల్‌లోని రోగులకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జాగృతి జిల్లా నాయకులు మహేష్ గౌడ్ మాట్లాడుతూ రక్తదానం చేసిన కా ర్య కర్తలను అభినందించి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన జాగృతి నాయకులకు అభినందనలు తెలియజేశారు.

## బీఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు



**జనోదయ :చెన్నూరు ఆర్సీ**

బిఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు చేయడానికి సంబంధించిన నోటీసులను శుక్రవారం కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో అందించడం జరిగింది. ఈసందర్భంగా బిఆర్ఎస్ నాయకులు ఎరినాగుల ఓదెలు, మాజీ సర్పంచ్ గజ్జల చందు, కడార్ల ధనంజై.గుగ్లోత్ బాపు నాయక్‌లపై కేసు నమోదు చేశారు.ఎన్ని కేసులు పెట్టిన బాల్క సుమన్ నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేంతవరకు ఈ ప్రభుత్వంపై పోరాటం చేస్తూనే ఉంటాం అని నాయకులు పేర్కొన్నారు.

# ప్రజలకు కాపలాదారులుగా ఉంటాం

మనం కూడా అభివృద్ధి వైపు పయనించాలనే మూసీ పునరుజ్జీవం చేస్తున్నట్లు సీఎం రేవంత్ వివరించారు. ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం ఇచ్చారన్నారు. వారికి తాము కాపాలదారులుగా ఉంటామని తెలిపారు. సింగపూర్, దుబాయ్, లండన్, సియోల్ నగరాలను తిరిగొచ్చానని చెప్పారు. మనకు ఏం అవసరమో అక్కడ స్టడీ చేసి వచ్చామన్నారు.

- »అసంపూర్తి సమాచారంతో కొందరు తప్పుడు ప్రచారం
- »ఉద్దేశపూర్వకంగా ప్రజల్ని ఆందోళనకు గురి చేశారు
- »ప్రజలకు నిజాలు చెప్పాల్సిన బాధ్యత నాపైన ఉంది
- »ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం ఇచ్చారు
- »మూసీ పునరుజ్జీవనాన్ని బీఆర్ఎస్, బీజేపీ ఎందుకు వ్యతిరేకిస్తున్నాయి?
- »వ్యతిరేకించడం కాదు..ఎలా చేద్దామో సలహా ఇవ్వండి
- »మీ సలహాలు స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నా
- »ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపాటు

మూసీ పునరుజ్జీవనాన్ని బీఆర్ఎస్, బీజేపీ ఎందుకు వ్యతిరేకిస్తున్నాయని ఆయన సూటిగా ప్రశ్నించారు. వ్యతిరేకించడం కాదు.. ఎలా చేద్దామో సలహా ఇవ్వండంటూ ఆయా పార్టీల నేతలకు ఆయన సూచించారు. మీ సలహాలు స్వీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. ప్రపంచంతో పోటీ పడుతూ అభివృద్ధి జరగొద్దా అని ఆయా పార్టీలకు సీఎం రేవంత్ చురకలంటించారు.



మూసీ ప్రాజెక్టుపై కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రజల్ని ఆందోళనకు గురి చేశారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మరికొందరు అసంపూర్తి సమాచారంతో తప్పుడు ప్రచారం చేశారని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు నిజాలు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని పేర్కొన్నారు.

**హైదరాబాద్: మార్చి 13:** మూసీ ప్రాజెక్టుపై కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రజల్ని ఆందోళనకు గురి చేశారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మరికొందరు అసంపూర్తి సమాచారంతో తప్పుడు ప్రచారం చేశారని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు నిజాలు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని పేర్కొన్నారు. ఇతర దేశాలు వేగంగా అభివృద్ధి వైపు పయనిస్తున్నాయని తెలిపారు. మనం కూడా అభివృద్ధి వైపు పయనించాలనే మూసీ పునరుజ్జీవం చేస్తున్నట్లు సీఎం రేవంత్ వివరించారు. ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం ఇచ్చారన్నారు. వారికి తాము కాపాలదారులుగా ఉంటామని తెలిపారు. సింగపూర్, దుబాయ్, లండన్, సియోల్ నగరాలను తిరిగొచ్చానని చెప్పారు. మనకు ఏం అవసరమో అక్కడ స్టడీ చేసి వచ్చామన్నారు. నదీ పరీవాహక ప్రాంతాల్లోనే ఆర్థిక వ్యవస్థ విరాజిల్లిందన్నారు.గొప్ప నగరాన్ని నిజాం రాజులు మనకు అందించారని తెలిపారు. వందేళ్ల క్రితం నిర్మించిన జలాశయాలు నేటికీ ప్రజల దాహార్తి తీరుస్తున్నాయని చెప్పారు. మూసీ అభివృద్ధి బాధ్యతాయుతంగా చేపట్టాలని ప్రయత్నిస్తున్నామన్నారు. మాకు పొలిటికల్ డిఫరెన్స్ ఉండొచ్చు.. కానీ పొలిటికల్ పెరాలసిస్ లేదన్నారు.మూసీ పునరుజ్జీవనాన్ని బీఆర్ఎస్, బీజేపీ ఎందుకు వ్యతిరేకిస్తున్నాయని ఆయన సూటిగా ప్రశ్నించారు. వ్యతిరేకించడం కాదు.. ఎలా చేద్దామో సలహా ఇవ్వండంటూ ఆయా పార్టీల నేతలకు ఆయన సూచించారు. మీ సలహాలు స్వీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. ప్రపంచంతో పోటీ పడుతూ అభివృద్ధి జరగొద్దా అని ఆయా పార్టీలకు సీఎం రేవంత్ చురకలంటించారు.

# విపత్తుల తీవ్రతను నివారించేందుకు ముందస్తు ప్రణాళికలు

**బాల్ రక్షా భారత్, సేల్స్ ఫోర్స్ ఫౌండేషన్ మరియు యూనిసెఫ్ సంయుక్త కార్యాచరణ**

**హైదరాబాద్ :** బాల్ రక్షా భారత్, సేల్స్ ఫోర్స్ ఫౌండేషన్ మరియు యూనిసెఫ్ విపత్తులను ముందే పసిగట్టి రాబోవు విపత్తులను అనగా ప్రకృతి పరంగా, మానవీయ తప్పిదలవలన మరియు ప్రతిరోజూ సమాజం ఎదుర్కొంటున్న ప్రమాదాలను మరియు వాటి తీవ్రతను ముందుగానే అంచనా వేసి దానికి రాష్ట్రంలో గత అనుభవాలను దృష్టి లో ఉంచుకొని సమాజాన్ని సమాయత్తం చేయడానికి ఒక రాష్ట్ర స్థాయి వర్కుషాప్ స్థానిక హోటల్ ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి సామాజిక కార్యకర్తలు , స్వచ్ఛంద సంస్థలు , ప్రభుత్వ అధికారులు మరియు ఎస్.డి.ఆర్.ఎఫ్ వంటి శాఖాధికారులు కూడా కార్యక్రమానికి విచ్చేసి వారి సలహాలను, సూచనలను అందించారు. ఈ వర్కుషాప్ ముఖోద్దేశ్యం రాష్ట్రంలో లేదా స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, రాబోవు కాలంలో ఎదుర్కోబోతున్న వేసవి కాలపు వేడి గాలులు, రోడ్డు భద్రత లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు , వరదలు , ఉప్పెనలు , భూకం పాలు మరియు ఆరోగ్యపరమైన అత్యవసర పరిస్థితులు, ప్రత్యేకించి పిల్లల భద్రత ఇంటినుండి పాఠ శాలకు -పాఠశాల నుండి ఇంటికి అనే దృక్కోణంలో తీసుకోవలసిన జాగ్రత్తలు , ప్రభుత్వ శాఖలు , స్వచ్ఛంద సంస్థలు , యువత, సమాజం, స్థానిక సంస్తలు, రాష్ట్ర పరిపాలనా విభాగాలు ఉమ్మడిగా చేపట్టాల్సిన తక్షణ మరియు దీర్ఘకాలిక ప్రణాళికలు మరియు చర్యలపై ఈ వర్కుషాప్‌లో సుదీర్ఘముగా చర్చించడం జరిగింది.ముఖ్యముగా పాఠశాల భద్రత , ఎర్లీ వార్నింగ్ (ముందస్తు ప్రకటన మరియు విపత్తులు నిర్వహణ మరియు వాటి తాకిడిని తగ్గించే విధివిధానపై ప్రత్యేకమైన చర్చ చేయగా అన్ని సంస్థలు యూనిసెఫ్ మరియు బాల్ రక్షా భారత్ అని పిలవబడే సేవ్ ద చిల్డ్రన్ సారథ్యంలో ఒక పటిష్టమైన కార్యాచరణ రూపకల్పనకు నాందిపలికింది . విపత్తులు నిర్వహణ మరియు సమాజ సమాయత్తం అనే అంశాలను పాఠశాల కార్యక్రమాల్లో మరియు సామాజిక కార్యక్రమాల్లో ఇనుమడింప చేయాలనీ తద్వారా అనుకున్న రీతిలో ఫలితాలు సాధించవచ్చని వర్కుషాప్‌లో పాల్గొన్న సభ్యుల సూచనగా వెలువడింది . అంతేకాక , ఈ వర్కుషాప్ ముఖ్యముగా వైపరీత్యాలను తగ్గించడానికి, వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రధానంగా దుర్భల పరిస్థితుల్లో వున్న పిల్లలు మరియు సమాజాన్ని సంరక్షించడానికి ముందస్తు ప్రణాళికలు అవసరమని తద్వారా పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యం ఉంటుందని తద్వారా ప్రాణ నష్టం మరియు ఆస్తి నష్టం జరగకుండా సమాయత్తం కావడం సాధ్యమౌతుందని ఈ ప్రణాళికలు రాష్ట్రంలో అనివార్యమని వక్తలు నొక్కివక్కాణించారు.ఈ సందర్భంగా బాల్ రక్షా భారత్ ఆంధ్రప్రదేశ్ మరియు తమిళనాడు రాష్ట్రాల్లో రూపొందించిన పాఠశాల భద్రతా కరికులం మరియు సాధించిన ప్రగతిని ఒక ఉదాహరణగా ప్రదర్శించగా , యూనిసెఫ్ మరియు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విపత్తుల నిర్వహణలో చేపట్టిన ఊహలను వివరిస్తూ కొన్ని కీలకం సలహాలతో ఒక మార్గదర్శకాన్ని రచించడానికి నాంది పలికారు . ఎటువంటి విపత్తు సంభవించినా పిల్లలు , మహిళలు , పేదరికం నడమ నివసించే సమాజాన్ని తప్పక ప్రాధాన్యతా క్రమంలో ఉంచాలని , తగిన కార్యక్రమాలు చేపట్టాలని వక్కాణించారు .ఈ సందర్భంగా సేల్స్ ఫోర్స్ ఫౌండేషన్ -బల్ రక్షా భారత్ రూపొందించిన మాదిరి పాఠశాల , అంగన్వాడీ మరియు కమ్యూనిటీ రిస్క్ మరియు రక్షణ ప్లాన్ ను విడుదల చేసి ప్రదర్శించారు .





ఈ కార్యక్రమానికి శ్రీ అచ్చలేందర్ రెడ్డి గారు, ఐ.ఎఫ్.ఎస్ పూర్వ ప్రిన్సిపాల్ కన్సర్వేటివ్ అఫ్ ఫారెస్ట్, పూర్వ బయోడైవర్సిటీ ఛైర్పర్సన్ మరియు బయోడైవర్సిటీ సలహాదారు ముఖ్య అతిధిగా పాల్గొనగా, రామప్ప కంచర్ల , విపత్తుల్లో ముందస్తు వ్యూహాల నిపుణులు , వికాస్ గోరా, హ్యూమానిటేరియన్ నిపుణులు , మహేందర్ రాజం , యూనిసెఫ్ డి.ఆర్ .ఆర్ ప్రతినిధి , మల్లాడి శ్రీనగేష్ , , దక్షిణ భారత ఎడ్యుకేషన్ అడ్వైసర్ , బాల్ రక్షా భారత్ , రంగనాథన్ , బాల్ రక్షా భారత్ , కత్తి నర్సింహారెడ్డి , పూర్వ ఉపాధ్యాయ ఏం.ఎల్.సి, ఆంధ్రప్రదేశ్ మరియు అల్ ఇండియా సెకండరీ టీచర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, జుట్టు గజేందర్ , ఎస్.టి యూ తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీ , సుబ్రహ్మణ్య రాజు, ఎస్.టి యూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ , ప్లాన్ , మహిత , వరల్డ్ విజన్ , మారి, ఎడ్యుకేట్ గర్ల్ పాల్గొన్నారు.